# మాధురీ మనోహరీయం

—— కోసూరి వెంకట కోటేశ్వరరావు

శ్రావణమాసం... పెళ్ళిళ్ళ సీజను. మనోహర్ తన స్నేహితుడు కృష్ణమూర్తి వివాహం కోసం వచ్చాడు ఆ ఊరికి. కరెంటు సౌకర్యం కూడా లేని సముద్ర తీర ప్రాంతం ఆ పల్లెటూరు. ఉదయం పది గంటలకు పెళ్ళి జరిగిపోయింది. క్రితం రాత్రి కుంభవృష్టి కురిసినప్పటికీ, పెళ్ళి ముహూర్తానికి వర్షం లేకపోవడం వారికి సంతోషం కలిగిస్తోంది. సన్నాయి మేళం, నాదస్వరం మొదలైన సాంప్రదాయక మేళాలు వినసొంపుగా ఉన్నాయి. నగరాలలో వలె చెవులను హోరెత్తించే బ్యాండు మేళాలు లేవు. ఆ చక్కని సంగీతంలో పెళ్ళికి వచ్చిన వారంతా ప్రేమ, వాత్సల్యంతో మాట్లాడుకోవడం గమనించాడు మనోహర్.

కన్నెపిల్లలు పట్టులంగాలు, ఓణీలు, చీరలతో చూడముచ్చటగా ఉన్నారు. స్వచ్ఛమైన పల్లె వాతావరణపు అమాయకత్వం తొణికిసలాడుతోంది. పెళ్ళిలో ఏ గొడవా లేదు. కృష్ణమూర్తి మేనమామ కూతురే అవడం, వారిది అదే ఊరు కావడం ఇరువర్గాల వాళ్ళు సంతోషంతో విందు భోజనం చేస్తున్నారు. మనోహరానికి ఆ సహపంక్తి భోజనం, కొసరికొసరి వడ్డించడం, కన్నెపిల్లలు వంగుని వడ్డిసుంటే జడలు ముందుకు వచ్చి వాలడం, తిరిగి జడలను వెనక్కి వేసుకోవడం, జారే పైటలను సర్దుకోవడం చూస్తుంటే పల్లెల్లోని వివాహాలు ఇంత థ్రిల్లింగ్‌గా ఉంటాయనుకోలేదు. వడ్డించే వాళ్ళతో సరసాలు ఆడుతున్నారు కొందరు. కొద్దిగా లావుపాటి అమ్మాయి బూరెలు వడ్డిస్తోంది. మనోహర్ పక్కనున్న బక్కపలచని వ్యక్తికి అందరితోపాటే వడ్డించబోతుంటే "ఏయ్ పిల్లా... అదిగో... నీలా ఉందే... ఆ బూరె... అటువంటివి వడ్డించు నాకు" అన్నాడు ఆ అమ్మాయిని ఆట పట్టిద్దామని. పాపం ఆ అమ్మాయి మొదట్లో కొద్దిగా సిగ్గుపడినా, తరువాత అలాంటివే వడ్డించి "ఇవి తినన్నా లావవుతావేమో! అసలే పావుసేరు కండకూడ లేదు శరీరం మొత్తం మీద... ఇంకా వడ్డించేదా?" అన్నది తనూ సరదాగానే... అందరూ నవ్వుకున్నారు.

మనోహర్ పుట్టింది చదివింది గుంటూరులో... ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం. నగరాలలోలాగ కృత్రిమ జీవనం లేదు... అంతా చక్కగ సాంప్రదాయబద్ధంగా ఉంది ఆ పల్లె వాతావరణం. అతని చూపులు ఉదయం నుంచి మాధురి కోసం వెదకసాగాయి కాని... ఆమె రాలేదు. సాయంత్రం ఎప్పుడవుతుందా... తనే వెళ్ళి కలవాలని ఎదురుచూస్తున్నాడు. నిమిషాలు గంటల్లా గడుస్తున్నాయి. వచ్చినవాళ్ళు చాలావరకు వెళ్ళిపోయారు. కాళ్ళకు చెప్పుల్లేవు. కొందామంటే... ఆ ఊరిలో... ఒక కిరాణా కొట్టు తప్ప... ఇంకో షాపేదీ లేదు. మొత్తానికి సాయంత్రం అయిదు గంటలు కావస్తుండగా నీట్‌గా తయారై, కృష్ణమూర్తి చెప్పులు ధరించి, తేలికగానే ఇల్లు గుర్తించి కాంపౌండ్ వాల్‌కున్న గేటు తెరుచుకుని ప్రవేశించాడు. వసారాలో ఎవరూ లేరు. తలుపు లోపల గడియ వేసి ఉండొచ్చు. తట్టినా ఎవరూ తీయలేదు. ఎవరూ ఉన్నట్టు లేదు. ఆలోచిస్తూ ఉండగా అతని చూపు ఎదురుగా ఉన్న ఫొటోలవైపు మళ్ళింది. అక్కడ ఉన్న మూడు ఫొటోల్లో ఒకటి... మాధురి ఫొటో... పరీక్షగా చూశాడు. అనుమానం లేదు. ఆమెదే... ఆశ్చర్యపోయాడు. అక్కడ ఫొటో ఉన్నందువల్ల ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు కానీ... మాధురి ఫొటోకు పూలదండ ఉండటమే. ఆశ్చర్యం... కాదు... భయం... ఫొటో కింద 'మాధురి' అని కూడ ఉంది. ఫొటోకు బూజు కూడా పట్టి ఉంది. అంటే ఆమె చనిపోయి నెలలో, సంవత్సరాలో అయి ఉండాలి. ఒళ్ళంతా చెమటలు... ఇంతలో ఎవరో బయటి నుంచి వచ్చినట్టుగా ఉంటే రెండడుగులు వెనక్కి వేశాడు.

"ఓ మీరా!" అన్నది ఆమె. ఉదయం కృష్ణమూర్తి పెళ్ళిలో చూశాడు ఆమెను.

"అవును నేనే... ఇంతకీ... ఈమె... మాధురి" అంటూ ఏదో అనబోయాడు.

ఆ యువతి ఆ ఫొటో వైపు చూస్తూ గుటకలు మింగుతోంది. ఆమె మొహంలో ఎంతో బాధ... అప్పటికప్పుడే కళ్ళల్లో నీరు కదలసాగింది. ఆమెతో ఏమీ మాట్లాడలేకపోతున్నాడు. ఆమె పరిస్థితీ అంతే. కొద్ది క్షణాల్లో తేరుకుని అక్కడ ఉండలేక వెనుదిరిగాడు వేగంగా... దాదాపు పరిగెత్తినట్టుగా వెళ్ళాడు కృష్ణమూర్తి ఇంటికి. అతనికి ఇది చాలా వింతగా, ఆశ్చర్యంగా, భయంగా ఉంది.

వర్షం ప్రారంభమైంది. వర్షానికి కూడా భయపడుతున్నాడు మనోహర్. అతను జీవితంలో ఇంతగా భయపడిన సంఘటన లేదు. ఆ ఊరిలో ఉండాలంటే భయం వేస్తోంది. అసలక్కడ ఉండబుద్ధి కాలేదు. బయట చూస్తే వర్షం... అక్కడి నుంచి దాదాపు ఆరు కిలోమీటర్లు నడిస్తేనేగాని బస్సు దొరకదు. ఈ వర్షంలో, అందునా రాత్రిపూట చాలా కష్టం... కొద్ది నిమిషాలు ఆలోచించి ఎలాగో ఈ రాత్రి గడిపి, ఉదయమే బయలుదేరి వెళ్ళిపోవాలనుకున్నాడు. ఆ రాత్రంతా ఒకటే ఆలోచన. కృష్ణమూర్తి తండ్రి ఏవేవో కబుర్లు చెబుతున్నాడు. కాని అవేవీ తను వినటంలా... భోజనం సహించలా... ఎలాగో తిన్నాననిపించుకుని... మంచం మీద పడుకున్నాడు... నిద్ర పట్టదే... బయట వర్షం... ముందు రోజు రాత్రి జరిగిన సంఘటనే గుర్తొస్తోంది...

★ ★ ★

మనోహర్ బస్సు దిగేటప్పటికి దాదాపు పదవుతోంది. అది చాలా చిన్న సెంటరు. అక్కడ ఓ టీస్టాల్ ఉంటే టీ తాగి బయలుదేరాడు. అక్కడి నుంచి ఆరు కిలోమీటర్లు దూరం నడవాలి. ఇక్కడే ఉందామంటే ఏ సౌకర్యమూ ఉన్నట్టు లేదు. తప్పదు... నడక ప్రారంభించాడు. ఆ ఊరు



దాటేటప్పటికి పదిహేను నిమిషాలు పట్టింది. ఇంకో కిలోమీటరు ప్రయాణించేసరికి వర్షం ప్రారంభమైంది. తన దగ్గర ఒక ఎయిర్‌బ్యాగ్ తప్ప ఇంకేమీ లేదు. గొడుగు తెచ్చుకోవడం మరచిపోవడం బాధ అనిపించింది.

చిమ్మచీకటి... బురద... సరైన రోడ్డు లేదు. అడుగువేసి ఇంకో అడుగు వేయాలంటే కష్టంగా ఉంది. కారణం బాగా తెలిసిన రోడ్డు కాదాయె. అన్నీ పొలాలే.... తాడిచెట్లు... పిల్ల కాలువలు. దీనికితోడు ఉరుములు, మెరుపులు... ఆ ఊరు రావడం ఇది రెండోసారి... ఇంతకు ముందెప్పుడో వచ్చాడోసారి. ఎలాగైనా సరే తను కృష్ణమూర్తి ఇంటికి త్వరగా చేరుకోవాలి.

ఆ సమయంలో వినిపించింది గజ్జెల సవ్వడి. చుట్టూ చూశాడు. ఆ చీకట్లో ఏమీ కనపడలా. కొద్ది క్షణాల తర్వాత మళ్ళీ ఆ సవ్వడి.... మళ్ళీ వెనుతిరిగి చూశాడు. దూరంగా ఎవరో... మనుషులేనా? కొద్దిగా భయం వేసింది. ఈ వర్షంలో తనలా వస్తున్నారేమో? ఆ సవ్వడి క్రమేణా దగ్గరవడంతో గుర్తించాడు... ఓ స్త్రీని... ఆమె గొడుగు ఆసరాతో వస్తోంది వడివడిగా. ఇంకో చేతిలో సూట్‌కేస్... మెరుపు వెలుగులో చూశాడామెను. ఇంత రాత్రివేళ... ఈ వర్షంలో... ఒంటరిగా... ఓ స్త్రీ అలా రావడం... ఆశ్చర్యం వేసింది. చూస్తుండగానే ఆమె తన పక్కకు వచ్చింది. అప్పటివరకు తన నెత్తిమీద ఉన్న హేండ్‌కర్చీఫ్ పిండి మరల నెత్తిమీద వేసుకున్నాడు.

"ఏ ఊరు వెళ్ళాలండీ?" అన్నదామె ముందుగా...

ఫరవాలేదు... తనకన్న ధైర్యం కలదే... తనే అడగలేక పోయాననుకుని తను ఎక్కడికి వెళ్ళాలో చెప్పాడు.

"మా ఊరే..." అని "గొడుగులోకి రండి... తడిసిపోతున్నారు" అంటూ దగ్గరకు జరిగింది.

అది చాలా చిన్నగొడుగు. ఇద్దరూ అతికష్టం మీద అడుగులో అడుగు వేస్తున్నారు.

"ఎక్కడి నుంచి వస్తున్నారు?" మరల ఆమే అడిగింది.

"హైదరాబాద్ నుంచి... కృష్ణమూర్తి వివాహానికి..."

"ఓహో! అతని పెళ్ళికా? ఒక్కరే వస్తున్నారే - మీ భార్య..."

"నాకింకా పెళ్ళి కాలేదు"

"అలాగా..." అన్నది చిర్నవ్వుతో.

"మీరూ... ఒక్కరే... ఇంత రాత్రివేళ..." తనూ మాట్లాడాలనుకుని అన్నాడు.

"నేను విజయవాడ నుంచి వస్తున్నా... ఎప్పుడో ఆరు గంటలకు రావలసిన బస్సు. ఇంత లేటయింది"

ఇప్పుడు తనూ ఆ గొడుగులోకి చేరడంవల్ల ఆమె కూడా ఒకవైపు తడచిపోవడం చూసి అన్నాడు. "అనవసరంగా నా వల్ల మీరూ తడిసిపోతున్నారు. నేనెటూ తడిసిపోయాగా... మీరే ఉండండి గొడుగులో" అంటూ బయటికి నడవబోగా, వారించి అతనికి దగ్గరగా జరిగింది. ఇంతలో కెవ్వున కేక వేసి అతనిని కౌగిలించుకున్నంత పనిచేసింది. ఏమిటా అన్నట్టు చూడగా ఎదురుగా పెద్ద పాము పాకుతూ పోతోంది. మెరుపుల వెలుగులో మెరుస్తోంది. మనోహర్ గుండె వేగంగా కొట్టుకోసాగింది. పక్కనున్న వ్యక్తి స్త్రీ అవడంతో... లేని ధైర్యం తెచ్చుకున్నాడు. ఇంతలో ఆ పాము వెళ్ళిపోయింది.

ఇదే మొదటిసారి ఓ స్త్రీ మనోహరాన్ని కౌగిలించుకోవడం. ఏదో తెలియని అనుభూతి. నెమ్మదిగా విడిపోయారు. నడక ప్రారంభించి కొద్ది దూరం వెళ్ళాక ఓ బురద గుంటలోకి జారారు. ఒకరినొకరు పట్టుకునైతే పైకి వచ్చారు కాని ఇద్దరి పాదరక్షలూ బురదగుంటలో ఇరుక్కుని రాలేదు. ఇక లాభం లేదనుకుని అలాగే నడుస్తున్నారు. ఇంతలో అతని చూపు ఓ చోట ఆగింది. చిన్న గుడిసె మెరుపుల వెలుగులో కనపడటంతో ఆమెతో అన్నాడు.

"అవును. నిజమే. అక్కడ చిన్న గుడిసె ఉంది. వెళదాం కొంతసేపు తలదాచుకోవచ్చు" ఆమె అనగానే ఇద్దరూ ఆ గుడిసె దగ్గరకు వెళ్ళి ఎవరైనా వస్తారేమోనని పిలిచారు. సమాధానం లేదు. ఓ మూల చిన్న వత్తితో లాంతరు వెలుగుతోంది. ఓ పక్కన నులకమంచం ఉంది. అది వాల్చి కూర్చున్నారిద్దరూ. ఆమె తన చీర కొంగును పిండుతోంది. అతను లేచి వెళ్ళి లాంతరు వత్తి పెద్దది చేశాడు. అప్పుడు చూశాడామెను ఆ వెలుగులో. ఆమె ముక్కుపుడక లాంతరు కాంతికి మెరుస్తోంది. అప్సరసలా ఉందామె. ఇంతకీ పేరేమిటో... ఇంతవరకు అడగకపోవడం తనకే సిగ్గుగా ఉండి అడిగాడు. "మాధురి" అని "మీపేరు...?" అడిగింది ఎంతో మాధురంగా.

"మనోహర్"

ఇద్దరూ లోలోపల సంతోషించారు పేర్లు బాగుండటంతో. ఆమె తన బ్యాగ్‌లోంచి టవల్ తీసుకోవడానికని కిందకి వంగటంతో ఆమె పయ్యెద జారింది. అతని చూపు ఆమె గుండ్రటి స్తనాలపై పడటంతో ఏదో తీయని అనుభూతి ఒళ్ళంతా పాకుతోంది. రెండు చేతుల్తో ఆమెను కౌగిలించుకోవాలనే కోరిక కలిగింది. కానీ... అది సభ్యత కాదని తమాయించుకున్నాడు. మనోహర్ తన బ్యాగ్‌లోంచి లుంగీ తీసి కట్టుకుని ప్యాంటు, షర్టు ఆరేశాడు. ఆమె కూడా బట్టలు మార్చుకుంటుందేమోననే ఆలోచన వచ్చింది. అలానే తెల్లవార్లూ తడిసిన బట్టల్తో ఉండాలంటే కష్టం కదా! ఈ వర్షం ఇప్పట్లో తగ్గే సూచన లేదు.

ఆమెకు కూడా బట్టలు మార్చుకోవాలనే ఉంది. కాని ఎవరో పురుషుడు పక్కనుండగా... అమ్మో అనుకుంది. అలా అనుకుని తెల్లవార్లూ ఇలా ఉండాలంటే కష్టమే... ఎలా? అతను మాత్రం ఎటు వెళ్తాడు? అది ఒంటినిట్టాడి గుడిసె. వేరే గది లేదు.

మనోహర్ ధైర్యంచేసి అన్నాడు.

"మాధురిగారూ... నేను ఇటువైపు తిరిగి ఉంటాను. బట్టలు మార్చుకోండి" అన్నాడు.

"అమ్మో... మీ మగవాళ్ళని నమ్మడమే..."

అతను నవ్వి "మగవాళ్ళందరి బుద్ధి ఒకేలా ఉంటుందని ఎందుకనుకుంటారు" అన్నాడు నెమ్మదిగా.

అతని మాటల్లో నిజాయితీ గమనించింది. నిజమే అందరూ అలాంటి వారుంటారా... ఇప్పుడు తను ఒక్కతె. అతనిని నమ్మాలి. అంతకు మించి ఏమీ చేయగల స్థితి కాదు అనుకుంటూ బట్టలు తీసి మార్చుకుంది మనోహర్ అప్పటివరకు వేరేవైపు చూస్తూ నిలబడ్డాడు. మంచం మీద ఇద్దరూ కొద్ది దూరంలో కూర్చున్నాడు నేలంతా బురదగా ఉండటంతో. అప్పుడడిగింది అతని గురించి...

"నేను హైదరాబాద్‌లో ఒక పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో ఎకౌంట్స్ ఆఫీసర్ని. ఒక్క చెల్లెలుంటే ఈ మధ్యనే పెళ్ళి చేశా... ఇక నేనే పెళ్ళి చేసుకోవాలి... మీ విషయం చెప్పలా..."

"నేను బిఎస్‌సి చదివాను. ఉద్యోగ ప్రయత్నంలోనే ఉన్నా. నాకో అన్నయ్య ఉన్నాడు. అతను వ్యవసాయం చేస్తాడు. నాకు పెళ్ళవడం కష్టమే. అందువల్ల అతనికి చేసేశారు"

"ఎందుకు?" ఆశ్చర్యం, అనుమానంగా.

ఆమె తల వంచుకుంది. ఏదో బాధ... "నా చేయి చూడండి" అంటూ చూపించింది.

అది ఎడంచేయి. ఆ చేతికి మధ్యలో మూడేళ్ళు లేవు. కాలు కూడా చూపించింది. వాటికీ అంతే. మధ్య మూడేళ్ళూ లేవు.

"అరే... ఆశ్చర్యంగా ఉందే?"

"అవును. పుట్టుకతోనే ఇలా ఉన్నాయి. దీనిని 'గ్రహణం మొరిక' అంటారు. ఛాలా సంబంధాలొచ్చాయి కాని ఈ గ్రహణం మొరిక అడ్డురాగా... వాళ్ళ కోరిన కట్నకానుకలకు వెనుకంజ వేయాల్సి వచ్చింది. నాన్నగారికి రాజకీయాల పిచ్చి కారణంగా ఉన్న ఆస్తిలో మిగిలింది తక్కువే" మాధురి చేయి పట్టుకుని చూశాడు. అలాగే ఆమె పాదాలు కూడా. సుతిమెత్తని పాదాలు... పాపం... ఈ లోపం ఒక్కటే. ఈమె అందంలో అప్సరస.... తానింత వరకు ఇలాటి వ్యక్తుల్ని చూడలేదు. ఏదో యాక్సిడెంట్‌లో పోవడం వేరు. ఇది పుట్టుకతోనే భగవంతుడు ఇచ్చిన శాపమేమో?! దీనికి బాధ్యురాలు ఆమె కాదు కదా! ఈ లోపం తప్ప మిగతా అన్ని విషయాలలోను వంక పెట్టే పనిలేదు. కొన్ని క్షణాలు ఆలోచించి

"మాధురిగారూ! నామీద మీ అభిప్రాయం..."

"మన పరిచయం కొద్ది గంటల ముందే... అభిప్రాయం అడిగితే ఏం చెప్పగలను?"

"నిజమే... మీరన్నది కూడా... నాకు ఉన్న బంధువులు చాలా తక్కువ. ఏ బాధ్యతలు లేవు. నేను నా అడ్రస్ ఇస్తాను. నా గురించి అన్ని విషయాలు తెలుసుకుని మీరు ఒప్పుకుంటే నాకేమీ అభ్యంతరం లేదు మిమ్మల్ని వివాహం చేసుకోవడానికి" అన్నాడు మనోహర్.

మాధురి కొన్ని క్షణాలు ఆలోచించి...

"మనోహర్‌గారూ... పెళ్ళిచూపుల సమయంలో కేవలం కొన్ని నిమిషాలు ఒకరినొకరు చూసుకుని సిద్ధపడతారు పెళ్ళికి. అటువంటిది దాదాపు నాలుగు గంటలు కావస్తోంది మనం కలిసి. ఒకరినొకరం అర్థం చేసుకోవడానికి ఇంతకంటె ఇంకేం కావాలి... మీకు ఇష్టమైతే... నాకూ ఇష్టమే. మా అన్నయ్య అమ్మా నాన్నలను ఒప్పించగలను కూడా" అని కొన్ని క్షణాల తర్వాత మరల అన్నది "అయితే ఒక్క విషయం... నా అంగవైకల్యానికి సానుభూతిగా చేసుకోవద్దు..."

"నో... నో... మాధురిగారూ... అటువంటిదేమీ లేదు. ఆ విషయం పొరపాటున కూడ నా నోటి నుంచి రాదు. రేపు మీ ఇంటికి వచ్చి మీ నాన్నగారితో మాట్లాడతాను" అన్నాడు సంతోషంగా.

(మిగతా 14వ పేజీలో....)

